పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పింఛన్‌ల పంపిణీ వారోత్సవాలలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



పెంచిన పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, నాయకులు

పెదపరిమి(తాడికొండ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విమర్శించడమే తప్ప పేద ప్రజలకు మంచి చేద్దామనే ఆలోచన టీడీపీకి ఏ కోశానా లేదని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో పెంచిన పింఛన్ వారోత్సవాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98.05 శాతం నెరవేర్చి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. 14 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించి 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు జగనన్న గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బాబు హయాంలో పేదలకు సంక్షేమం అందాలంటే జన్మభూమి కమిటీల కనుసన్నల్లో ఆమోదముద్ర పడాల్సి ఉండేదని, దీనిని ఆసరాగా చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో పేదలను బానిసలుగా మార్చాలని చూసిన బాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని గుర్తుంచుకొని మసలుకుంటే మంచిదన్నారు. కరోనా కష్టకాలంలోనే సంక్షోభాలను ఎదుర్కొని సంక్షేమం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఒక్క రూపాయి అవినీతి లేకుండా పేదలకు సంక్షేమ సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసిన జగనన్నకు ప్రజలు నీరాజనాలు పలకడం ఖాయమన్నారు. జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఎల్లో మీడియాతో కలిసి విషం చిమ్మేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. తనకు ఏదో ప్రజాదరణ ఉందని చూపించుకునేందుకు ఇరుకు రోడ్లపై బాబు నిర్వహించిన సభలు ప్రజలను బలితీసుకున్నా తన తీరు మార్చుకోకుండా బాబు అనుమతులు లేకుండా రోడ్‌షోలు నిర్వహించడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం కాదా అని ప్రశ్నించారు.

బ్రిటీష్ కాలంనాటి భూ రికార్డుల స్వచ్ఛీకరణ హర్షణీయం

బ్రిటీష్ కాలం నాటి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు భూ రికార్డుల స్వచ్ఛీకరణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడం హర్షణీయమని ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. ఇది పూర్తయితే రెవెన్యూ వివాదాలు తొలగిపోయి వందల ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారమవడం ఖాయమన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసిన జగనన్న ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారన్నారు. తుళ్లూరు మండలం పరిధిలో నూతనంగా మంజూరైన 216 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పార్టీ తుళ్లూరు మండల అధ్యక్షుడు మాదల మహేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కొండవీటి రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు రఘునాధరావు, నంబూరు బాబురావు, ఆలూరి శ్రీనివాసరావు, కొమ్మినేని విష్ణు, దాసరి రంగారావు, ఎంపీడీవో ఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉండవల్లిలో కిడ్నాప్ కలకలం

మంగళగిరి: నగర పరిధిలోని ఉండవల్లిలో కిడ్నాప్ కలకలం చోటుచేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఉండవల్లికి చెందిన నరేష్, బండి శ్రీను దగ్గర ద్విచక్ర వాహనం తీసుకుని ఫైనాన్స్‌లో తనఖా పెట్టాడు. వాహనాన్ని తీసుకుని పనికి వెళ్లకపోవడంతో శ్రీను, నరేష్‌ను ప్రశ్నించగా బండి తాకట్టు పెట్టానని చెప్పడంతో తన వాహనాన్ని ఫైనాన్స్ కంపెనీ నుంచి విడిపించాలని గొడవకు దిగాడు. నరేష్ వాహనాన్ని ఇప్పించకపోవడంతో శ్రీను కొందరు యువకులతో కలసి గురువారం నరేష్ ఇంటికి వెళ్లాడు. నరేష్‌ను ద్విచక్ర వాహనం ఎక్కించుకుని ఫైనాన్స్ కంపెనీ వద్దకు వెళ్లారు. నరేష్ సతీమణి తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కిడ్నాప్ కలకలం అంటూ వార్తలు రావడంతో శ్రీను నరేష్‌ను తీసుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయం వివరించడంతో వివాదం ముగిసింది.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

ఫిరంగిపురం: నరసరావుపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం నుదురుపాడు సబ్‌స్టేషన్, ఫిరంగిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ పుల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

మంగళగిరి: మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖరబాబు అన్నారు. నగర పరిధిలోని పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి శేఖర్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదుగురు నిందితుల అరెస్ట్

ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



మంగళగిరి: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పట్టణ సీఐ అంకమ్మరావు తెలిపిన వివరాలు.. వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న మంగళగిరికి చెందిన ముహమ్మద్ సుభానీ, షేక్ సల్మాన్, గుంటూరుకు చెందిన షేక్ యూసఫ్, వడ్డేశ్వరానికి చెందిన కోట దిలీప్, నవులూరుకు చెందిన ముహమ్మద్ సాహైల్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

లలిత్‌బాబుకు డాక్టరేట్ ప్రదానం



మంగళగిరి: దుగ్గిరాల ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ప్రొఫెసర్ లలిత్‌బాబుకు మెట్రలాజికల్ సైన్స్‌లో డాక్టరేట్ లభించింది. ఇటీవల గోవాలో జరిగిన కార్యక్రమంలో లలిత్‌బాబుకు గోవా ముఖ్యమంత్రి దిగంబర కామత్ డాక్టరేట్ ప్రదానం చేశారు. శుక్రవారం లలిత్‌బాబును కళాశాల చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి, ప్రిన్సిపల్ ఎన్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్లు అభినందించారు.

మెడికల్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ క్యాలెండర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డె బాలయ్య నాలుగో తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. నర్సింగ్ సూపరింటెండెంట్ తులశమ్మ, యూనియన్ నాయకులు హనుమంతరావు, సాంబనాయక్, వెంకటేశ్వరరావు, కుమార్‌రాజా, రవిశంకర్, నాగరాజు, కృష్ణ, కోటేశ్వరరావు, కమలకుమారి, సాంబి, జోత్స్న, జయమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బాధితుల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మంగళగిరి: దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామానికి చెందిన చింతా రాజేష్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇటీవల మృతి చెందిన రాజేష్ కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే ఆర్కే పరామర్శించి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తానని హామీనిచ్చారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ చేతుల మీదుగా శుక్రవారం లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎస్సీ కాలనీకి చెందిన నాదెండ్ల జహ్వంత్ ఇటీవల బఫే ప్లేట్ల తయారీయంత్రంలో చేయిపడి వేళ్లు కోల్పోయాడు. గురువారం జహ్వంత్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఆర్కే శుక్రవారం ఎంపీపీ, జెడ్పీటీసీల ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంపల గంగాధర్, వైఎస్సార్ సీపీ నాయకులు నూతలపాటి కేశవరావు, నల్లగొర్ల నాగేశ్వరరావు, డీవీఆర్, ఆళ్ల మహేష్, మేదర సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో 9, 10 తేదీల్లో యూనిక్ క్రిస్ట్ 2కే-23



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరస్పాండెంట్, సెక్రటరీ మర్రెడ్డి

మేడికొండూరు: ఫిబ్రవరి 9, 10 తేదీల్లో యూనిక్ క్రిస్ట్ 2కే-23ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవ. ఫాదర్ మాలపాటి మర్రెడ్డి తెలిపారు. పేరేచర్ల-నరసరావుపేట రోడ్డులోని యూనివర్సల్ కళాశాలలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. యూనిక్ క్రిస్ట్ 2కే -23 పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2010 నుండి ఈ యూనిక్ క్రిస్ట్ నిర్వహిస్తున్నామని, దానికి ఆదరణ పెరిగిందన్నారు. నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యనందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరెడ్డి మాట్లాడుతూ 2020లో నిర్వహించిన యూనిక్ క్రిస్ట్ 2కే-22ని ఎంతో ఆదరించి ఉత్సాహపరిచారన్నారు. 2కే 23ని కూడా అలాగే విజయవంతం చేయాలన్నారు. జాతీయ టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ నందు పేపర్ ప్రజెంటేషన్ ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్ ప్రజంటేషన్ క్రియేట్ ఫొటోగ్రఫీ, సింగింగ్, వివిధ రకాల క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. విజేతలకు రూ. 3 లక్షల నగదు బహుమతులు ఉంటాయన్నారు. సమావేశంలో కన్వీనర్ దాసరి విన్ని, కో కన్వీనర్ డాక్టర్ బాలాజీ నాయక్, నరేంద్రరెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతో పలు సమస్యలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ, ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: పోషకాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ అన్నారు. మండలకేంద్రంలోని శాంతిపేట రెండో వార్డులో అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోషకాహార లోపం వల్ల ఎన్నో సమస్యలు వస్తాయని దాని నివారణకు ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు, పండ్లు, పోషక విలువలతో కూడిన చిరుధాన్యాలు తీసుకోవాలని చెప్పారు.

ఇంటిలో ఉండే వస్తువులతో పోషక విలువలు కలిగిన ఆహారం ఎలా తయారు చేసుకోవాలో అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. అనంతరం ఫ్రైడే-డ్రైడేలో భాగంగా కాలనీలో ఇంటింటికి తిరిగి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆటలతోనే ఆరోగ్యం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కత్తెర సురేష్ కుమార్, డి.కత్తిరేణమ్మ, షేక్ షహేలానర్గీస్

ఫిరంగిపురం: విద్యార్థులు ఆటలు ఆడటం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెం వసంతనగర్ జెడ్పీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్లే గ్రౌండ్‌కు వెళ్లే రోడ్డు బాగాలేదని, గ్రౌండు చుట్టూ ఫెన్సింగ్, క్రీడాపరికరాల కోసం జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనాకు తెలియజేసి వసతుల కల్పనకు కృషిచేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో వారికి ట్యాబ్‌లు అందజేస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వినియోగించుకొని ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయంలో ఘనంగా శివ ముక్కోటి



శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారు



ఫిరంగిపురంలో విశేష అలంకారంలో నగరేశ్వరుడు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శివ ముక్కోటిని పురస్కరించుకుని స్వామి వారి ఉత్తర ద్వార దర్శన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరుడు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పలువురు దాతలు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమై మిద్దె సెంటర్‌కు చేరుకుని తిరిగి పెద్ద కోనేరు మీదుగా దేవాలయానికి చేరుకుంది. దేవస్థాన ప్రధాన అర్చకులు టి మహేష్‌కుమార్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ లక్ష్మీరాధిక దంపతులతో పాటు పలువురు ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి జేవీ నారాయణ పర్యవేక్షించారు.

ఫిరంగిపురం: మండలంలోని పలు శివాలయాల్లో శుక్రవారం శివముక్కోటిని పురస్కరించుకొని అర్చకులు స్వామివార్లకు విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఫిరంగిపురంలోని నగరేశ్వరస్వామికి అర్చకులు రాజేంద్రశర్మ విశేష అర్చనలు, అష్టోత్తర పూజలు చేశారు. కాళహస్తీశ్వరస్వామికి అర్చకులు ఆంజనేయశర్మ అభిషేకాలు చేసి సహస్రనామ బిల్వపత్ర పూజలు చేశారు. వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామికి అర్చకులు ఉమాపతిశాస్త్రి పంచామృతాలతో అభిషేకాలు చేసి విశేషంగా స్వామిని అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజారోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

బాపట్ల ఎంపీ నందిగం సురేష్



ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ప్రజారోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో కలిసి ఆయన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ సురేష్ మాట్లాడుతూ దోమలను సమర్థంగా నిర్మూలించడం ద్వారా కీటకాల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతకమైన రోగాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం గ్రామాలలో పారిశుద్ధ్యం, ఇంటింటికి చెత్త సేకరణ ద్వారా కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతుందన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం ద్వారా దోమల ఆవాసాలను తొలగించి అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజారోగ్యానికి భద్రత ఏర్పడుతుందన్నారు. అవగాహన ర్యాలీని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బారాయుడు, సహాయ అధికారి రాజునాయక్, మంగళగిరి మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, తుళ్లూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లూథర్ చర్చి వార్షిక ప్రతిష్టా మహోత్సవం



వాక్యోపదేశం అందిస్తున్న పాస్టర్లు

తాడికొండ: తాడికొండలో క్రీస్తు సంఘం లూథరన్ చర్చి 5వ వార్షిక ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పలువురు లూథరన్ సంఘ పాస్టర్లు వాక్యోపదేశం చేసి భక్తులకు సందేశం అందించారు. బంధుమిత్రులు, భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు

ఉద్యోగ విరమణ పొందిన సీడీపీవో ఇందిరకు ఘన సత్కారం

తాడికొండ: అంకితభావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, సిబ్బంది కొనియాడారు. తాడికొండ సీడీపీవోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఆర్ ఇందిరకు శుక్రవారం తాడికొండ సాయి బాబా ఆలయ కల్యాణ మండపంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఇందిరను ఘనంగా సత్కరించారు. పలువురు అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న సత్తెనపల్లి వాణిజ్య పన్నుల శాఖాధికారి వేణుగోపాలరావు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని వస్త్రదుకాణాలలో శుక్రవారం సత్తెనపల్లి వాణిజ్యపన్నుల శాఖాధికారి వేణుగోపాలరావు తనిఖీలు చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అధికారుల రాకతో గ్రామంలోని పలు వస్త్ర, ఐరన్, సరుకుల దుకాణాలను వ్యాపారులు మూసివేశారు.

వ్యక్తిత్వ వికాస నిపుణుడు స్వామి వివేకానంద

గుంటూరుఎడ్యుకేషన్: భారతదేశ గొప్పతనాన్ని విశ్వవేదికగా ప్రపంచదేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానందుడు ఒక మేనేజ్‌మెంట్ గురువుగా, ఆధునిక సమాజపు వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా నిలిచారని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల కమ్యూనిటీ విభాగ వైద్య నిపుణుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఉన్నారు.

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు

జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో టెండర్ పొందిన అభివృద్ధి పనులు వేగంగా జరగాలని, టెండర్ పొంది పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో అభివృద్ధి పనులు, నాడు-నేడు పనులు, హౌసింగ్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, హౌసింగ్, విద్యుత్ శాఖ అధికారులతో, ఎమినిటి కార్యదర్శులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ నుంచి అనుమతులు మంజూరు చేస్తున్నామని, అటువంటి పనుల్లో రాజీ పడకుండా వేగంగా, నాణ్యతా ప్రమాణాలకు తగ్గకుండా పనులు జరగాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం(జీజీఎంసీ)లో భాగంగా ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో గుర్తించిన పనులకు కూడా వెంటనే టెండర్స్ పిలిచి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. పనులను ఈఈలు నేరుగా పర్యవేక్షణ చేయాలన్నారు. పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్స్ అప్ లోడ్ చేయాలన్నారు. ఇంకా నిర్మాణ దశలో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయడంతోపాటు కోర్టు కేసుల్లో నిర్దేశిత గడువులోగా కౌంటర్స్, అఫిడవిట్స్ వేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలోని అన్ని ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని, సులభ్ ఆధ్వర్యంలోని వాటిని కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. నగరంలో గాంధీ పార్క్ పనులు ఈ నెలాఖరుకి పూర్తి చేయాలని, అలాగే ప్రధాన జంక్షన్లను, ట్రాఫిక్ ఐలాండ్స్ ను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏ.డి.హెచ్.ని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా ఎఫ్.ఆర్.ఎస్. ద్వారానే హాజరు నమోదు చేయాలన్నారు. హౌసింగ్ అంశాన్ని సమీక్షించి, లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలకు తగిన విధంగా బోర్స్ వేయడానికి చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

లే అవుట్స్ వారిగా ఇప్పటి వరకు జరిగిన ఇళ్ల నిర్మాణాన్ని అధికారుల నుండి అడిగి తెలుసుకొని, ఇళ్ల నిర్మాణ పనులు కాంట్రాక్టర్లు వేగంగా చేయాలని, లబ్ధిదారుల నుంచి ఎంఓయు, బ్యాంక్ అకౌంట్ల వివరాలను ఎమినిటి కార్యదర్శులు సేకరించాలన్నారు. శ్యామలానగర్ ఆర్‌యూబీకి డీపీఆర్‌ను త్వరగా సిద్ధం చేయాలని, నగరంలోని ఆర్‌అండ్ బీ రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలలో నిర్మించిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు, నగరంలోని రిజర్వాయర్లకు ప్రత్యేక లైన్ ద్వారా విద్యుత్ అందించడానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సీపీడీసీఎల్ ఈఈని ఆదేశించారు. అలాగే నందివెలుగు రోడ్, పెద్ద పలకలూరు రోడ్లలో డ్రెయిన్ నిర్మాణం అయిన ప్రాంతాల్లో వెంటనే విద్యుత్ స్తంభాలు షిఫ్ట్ చేయాలన్నారు.

సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మి, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, ఈఈలు సుందర రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏపిసిపిడిసిఎల్ ఈఈ శ్రీనివాసబాబు, హౌసింగ్ ఈఈ శంకరరావు, ఏ.డి.హెచ్. రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలు వాహనాలు నడిపితే చర్యలు

పట్నంబజారు: మైనర్‌లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం హెచ్చరించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 30 మంది బాలబాలికలు వాహనాలు నడపటాన్ని గుర్తించారు. మైనర్ వాహనాలను సీజ్ చేయటంతో పాటు, తల్లిదండ్రులపైన చర్యలు చేపడుతున్నట్లు డీటీసీ కరీం వెల్లడించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, మైనర్‌లు వాహనాలు నడపకూడదని, తద్వారా జరిగే పరిణామాలను వివరించటం జరిగిందన్నారు. రహదారి ప్రమాదాల్లో 70శాతం ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వలనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. తనిఖీల్లో ఆర్టీఓలు అధికారులు రాఘవరావు, గోపాల్, మల్లేశ్వరి, సౌజన్య, ఉషా కిరణ్, మధుసూదన్ రావు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో జాతీయ ఫిలిం ఫెస్టివల్

మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరంలో గల కేఎల్ యూనివర్సిటీలో జాతీయ ఫిలిం ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం లఘు చిత్ర పోటీలతోపాటు డ్యాన్స్, నాటికల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. వీసీ జి పార్థసారథివర్మ, ప్రో.వీసీ డాక్టర్ ఎన్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ ఎ జగదీష్ పాల్గొన్నారు.

8న అవోపా స్వర్ణోత్సవ వేడుకలు

పాత గుంటూరు: ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) స్వర్ణోత్సవ వేడుకలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం తెలిపారు. శుక్రవారం అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ మంగళదాస్ నగర్‌లోని ఏఎస్. కన్వెన్షన్ సెంటర్‌లో వేంకటేశ్వర గానామృత కల్యాణంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వర్ణోత్సవ వేడుక సభ, వయోవృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ, వస్త్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అవోపా ప్రధాన కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి సూర్యనారాయణ, చైర్మన్ అన్నా నంద కిషోర్, వి.కృష్ణానంద్ పాల్గొన్నారు.